క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు తురకలాపట్నం విద్యార్థులు



రాష్ట్రసాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రొద్దం: తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీసాయిప్రణీత్‌రాజ్, దీక్షిత్‌రెడ్డి సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంగప్ప, పీడీ రామకృష్ణ శనివారం తెలిపారు. ఈనెల 9న అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు వివరించారు. వీరు విశాఖపట్నం జిల్లా కేడీపేటలో జరిగే అంతర్ జిల్లా పోటీలలో ఆడునున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్డీటీని రక్షించుకుందాం



సర్పంచుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రొద్దం: ఆర్డీటీ సంస్థను ఐకమత్యంగా ఉండి రక్షించుకుందామని దొడగట్ట గ్రామస్తులు పేర్కొన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరుతూ గ్రామస్తుడు గోపాల్ ఆధ్వర్యంలో వారు శనివారం రొద్దం సర్పంచ్ రూపకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లా సహా ఇతర ప్రాంతాల్లో దాదాపు 4.50 లక్షల మందికి సేవలు అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల ఆర్డీటీకి వచ్చే విదేశీ నిధులు ఆగిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవానికి విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లేపాక్షి: పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కళా ఉత్సవం – 2025లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, పీఈటీ సురేష్ బాబు శనివారం తెలిపారు. ఈనెల 11న బుక్కపట్నంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి కళా ఉత్సవంలో 3డీ ఆర్ట్‌లో 9వ తరగతి విద్యార్థి ఎస్ఆర్ క్రిష్ణమయి ప్రథమస్థానం, బుర్రకథ పోటీల్లో బి.గుణశేఖర్, కే.హర్షవర్ధన్, ఎల్.మోహన్ ద్వితీయ స్థానం, కనువిప్పు నాటికలో యస్.పుణీత్, ఎల్.మోహన్, యు.నవీన్ కుమార్, పి.భవ్య, ఆర్.మంజునాథ్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. దీంతో నిర్వాహకులు వీరిని విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. వీరికి ఉపాధ్యాయురాలు డి.రోజీమేర్సీ శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పెనుకొండ: పట్టణ సమీపంలోని ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలయ్యాయి. వివరాలు.. పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన నాగరాజు, మారుతి నగర్‌కు చెందిన లక్ష్మి ఆటోలో సోమందేపల్లి వైపు నుంచి పెనుకొండకు వస్తుండగా చెక్‌పోస్ట్ సమీపంలో వోల్వో బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న నాగరాజు, లక్ష్మి తీవ్రగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు వారిని అనంతపురం రెఫర్ చేశారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించండి



భవనాలను ప్రారంభించిన జడ్జి మాదేశ్

పావగడ: స్థానిక జేఎంఎఫ్‌సీ కోర్టు ఆవరణలో తాలూకా న్యాయ సేవా సమితి, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన న్యాయ సలహా కేంద్రం, మధ్య వర్తిత్వం కేంద్రం భవనాలను స్థానిక సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి మాదేశ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సాధి ఇంటింటా న్యాయంపై చైతన్యం తీసుకురావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్ శేషానందన్, కార్యదర్శి ఏ ప్రభాకరరెడ్డి, ప్రధాన సివిల్ న్యాయమూర్తి సీఎస్ మునిరత్నమ్మ, ఏపీపీ సన్జీరప్ప పాల్గొన్నారు.

తగ్గుతున్న వేరుశనగ సాగు

- పెరిగిన పెట్టుబడి, కూలి రేట్లు
- వర్షాభావ పరిస్థితులూ కారణమే

పరిగి: వేరుశనగ సాగుకు ఉమ్మడి అనంతపురం జిల్లా దేశవ్యాప్తంగా పేరుగాంచింది. అలాగే అంతర పంటలుగా అముదం, కంది, అలసందలు, అనపకాయ పండించేవారు. అయితే ప్రస్తుతం వేరుశనగ పంటను సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనపరచడం లేదు. పెట్టుబడి పెరగడం, వర్షాలు సకాలంలో రాకపోవడంతో పంట ఎండిపోయి రైతులకు తీరని నష్టాలను మిగిలుస్తున్నాయి. మరోవైపు పంట పండించినా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో వారు కుదేలయ్యారు. పంట సాగులో తెగుళ్ల సమస్య చేదు అనుభవాలను మిగిల్చాయి. ఫలితంగా ప్రత్యామ్నాయ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వేరుశనగ సాగు రానురానూ గణనీయంగా తగ్గిపోతోంది.

నియోజకవర్గంలో సాగు ఇలా...

ఈ ఏడాది పరిగి మండలంలో 125, రొద్దం 110, గోరంట్ల 450, సోమందేపల్లి 61, పెనుకొండ మండలంలో 90 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగైనట్లు అంచనా. గతంలో వేలాది ఎకరాల్లో సాగయ్యే వేరుశనగ పంట ప్రస్తుతం వందల సంఖ్యకు పడిపోయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అతివృష్టి, అనావృష్టి ఒకెత్తయితే వన్యప్రాణుల బారి నుంచి పంటలను కాపాడుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పరిగి మండలంలో వేరుశనగ సాగు చేస్తున్న దృశ్యం

గిట్టుబాటు ధర కల్పించాలి



నాకున్న వ్యవసాయ మెట్ట భూమిలో నాలుగెకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నాను. ఎకరాకు దాదాపు రూ.30 వేలు ఖర్చవుతోంది. ప్రభుత్వాలు వేరుశనగ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– చిక్కన్న, రైతు, కాలువపల్లి

సెజ్ భూముల్లో సాగుకు సహకరించాలి



పరిగి, మడకశిర మండలాల్లో సెజ్ భూమి బీడుగా ఉన్నాయి. భూముల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, రైతులను భూముల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారు. నాడు పరిశ్రమలను స్థాపించి ఉద్యోగాలిస్తామని నమ్మబలికి ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. భూములను సాగు చేసుకోనివ్వడం లేదు.

– నరసింహప్ప, శ్రీరంగరాజుపల్లి

చెరువులకు నీరందించాలి



వేరుశనగ సాగుకు అతివృష్టి, అనావృష్టి వెంటాడుతున్నాయి. హంద్రీ–నీవా ద్వారా చెరువులకు నీరందించాలి. తద్వారా ఆయకట్టు భూములతోపాటు ఇతర భూముల్లో విస్తారంగా పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది.

– ధనాపురం వెంకట్రామిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు

సర్పంచ్ అశ్వత్థ్‌కుమార్‌కు పరామర్శ



అశ్వత్థ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: మందలపల్లి సర్పంచ్ అశ్వత్థ్‌కుమార్ అనారోగ్యంతో కర్ణాకట రాష్ట్రం తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం ఆసుపత్రికి చేరుకుని అశ్వత్థ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి సర్పంచ్‌కు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మోరుబాగల్ సర్పంచ్ తిప్పేస్వామి, నాయకులు పాండు, ఈరన్న పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం

మడకశిర: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం ప్రాథమిక పాఠశాలలో రూ.4 లక్షల విరాళంతో నిర్మించిన భవనాన్ని దాత నాగరత్నమ్మ శనివారం ప్రారంభించారు. పట్టణానికి చెందిన ప్రముఖ ఈఎన్‌టీ డాక్టర్ సీఏ సత్యనారాయణ జ్ఞాపకార్థం భవనాన్ని నిర్మించారు.

రాజీమార్గం ఎంతో ఉత్తమం

హిందూపురం: కేసుల పరిష్కారంలో రాజీమార్గం ఎంతో ఉత్తమమని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ అన్నారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి జాతీయ మెగా లోక్ అదాలత్ చేపట్టారు. ఈ సందర్భంగా మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 95 కేసులను పరిష్కరించారు. రెండు క్రిమినల్ అప్పీళ్ల ద్వారా బాధితుడికి రూ.4 లక్షలు అందజేశారు. రూ.29,90,000 వ్యయం చేసే 8 సివిల్ కేసులు, 6 చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించి బాధితులకు రూ.48,90,000 ఇప్పించారు. ఒక డీవీసీ కేసు ద్వారా బాధితురాలికి రూ.5 లక్షలు పరిహారం అందేలా చేశారు. అలాగే 59 మద్యం కేసులను పరిష్కరించి రూ.2,56,985 అపరాధ రుసుం విధించారు. 8 బ్యాంక్ కేసులను పరిష్కరించి రూ.3,37,029 బ్యాంకులకు జమ చేయాలని ఆదేశించారు. రెండు చిన్నపాటి తగాదా కేసులను పరిష్కరించి రూ.3500 జరిమానా విధించారు. అనంతరం కక్షిదారులకు అవార్డు పత్రులను అందజేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కక్షిదారులు, న్యాయస్థానాల సిబ్బంది, న్యాయవాదులకు బోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఏపీపీ నగేష్, లోక్ అదాలత్ సభ్యులు సిద్దు, రవిచంద్ర, సంతోషి కుమారి, మురళి, కళావతి, యూసుఫ్ లతోపాటు న్యాయవాదులు, లోక్ అదాలత్ హేమావతి పాల్గొన్నారు.



హిందూపురంలో అవార్డు ప్రతిని అందజేస్తున్న న్యాయమూర్తులు



మడకశిరలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి అశోక్‌కుమార్

100 కేసులు పరిష్కారం

మడకశిర: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా 100 కేసులు పరిష్కారమయ్యాయి. 65 ఎక్సైజ్ కేసులు పరిష్కరించి రూ.4,18,075 అపరాధ రుసుము విధించారు. అలాగే 19 క్రిమినల్ కేసులను పరిష్కరించి బాధితులకు రూ.26 వేలు ఇప్పించారు. 5 సివిల్ కేసులను పరిష్కరించి రూ.లక్ష అపరాధ రుసుం వసూలు చేశారు. 12 ఎస్‌టీపీ కేసులను పరిష్కరించి రూ.11,500 అపరాధ రుసం విధించారు. పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కోర్టులకు నూతన భవనాలను మంజూరు చేయించండి



జస్టిస్ రామకృష్ణప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు వన్నెరప్ప, శివశంకర్

హిందూపురం: పట్టణంలో కోర్టులకు నూతన భవనాలను మంజూరు చేయించాలని హైకోర్టు ఉమ్మడి అనంతపురం జిల్లా అడ్మిస్ట్రేషన్ జడ్జి జి.రామకృష్ణప్రసాద్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు శనివారం లేపాక్షికి విచ్చేసిన పరిపాలన జస్టిస్ రామకృష్ణప్రసాద్‌కు స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వన్నెరప్ప, న్యాయవాది శివశంకర్ వినతిపత్రం అందజేశారు. జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, దీంతో ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ భవనంలో తాత్కాలికంగా కోర్టులు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. జూనియర్ సివిల్ జడ్జి పోస్టు గత మార్చి నుంచి ఖాళీగా ఉందని, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రస్తుతం శిక్షణలో ఉన్నారని దీంతో కేసులు పరిష్కారం కాక కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. న్యాయమూర్తి సానుకూలంగా స్పందించినట్లు వన్నెరప్ప తెలిపారు.

రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం

రొద్దం: కూటమి ప్రభుత్వానికి రైతు సమస్యలు పట్టడం లేదని రైతు సంఘ నాయకులు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని రొద్దకాంబదేవి ఆలయ ప్రాంగణంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు ఫక్రొద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరగడంతోపాటు గిట్టుబాటు ధరలు రాక రైతులు కుదేలవుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 వేల ఎకరాలకు పైగా రైతుల భూములను సోలార్ కంపెనీలకు అప్పనంగా లీజుకు పేరుతో బలవంతం అప్పగించడం సరికాదన్నారు. మండలంలోని పెన్నానది నుంచి అసుక అక్రమంగా యథేచ్ఛగా సాగుతోందని ఆరోపించారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కే.శ్రీనివాసులు, ఆర్ గిరీష్, కమిటీ సభ్యులుగా రుద్రప్ప, రామాంజనేయులు, వేంకటేష్, హనుమంతు, హనుమయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యుడు కోగిర నారాయణ, భవననిర్మాణ కార్మిక సంఘం వర్కింగ్ సభ్యుడు కొడా వేంకటేశులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

హిందూపురం టౌన్: సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాల వద్ద పీడీఎస్‌యూ నాయకులు నిరసన తెలిపి కళాశాలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు అనుదీప్, నాజీర్, గణేష్ రెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

పరిగి: సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడం సరికాదని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. శనివారం మండలంలోని పలు కళాశాలల్లో తరగతుల నిర్వహణను అడ్డుకుని బంద్ చేయించారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరవింద్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం సెలవు దినాల్లో తరగతుల నిర్వహణ విరుద్ధమన్నారు. తరగతుల నిర్వహించిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులుకిరణ్, యశ్వంత్, బవేష్, హరీష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో నారాయణ జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలియజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వ్యక్తి అదృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రానికి చెందిన తిప్పయ్య శెట్టి(65) అదృశ్యమయ్యాడు. మూడు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిన తిప్పయ్య శెట్టి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం బాధితుడి భర్యా అనసూయమ్మ ఎస్ఐ రమేష్ బాబుకు ఫిర్యాదు చేశారు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి

పెనుకొండ: సీపీఎం నేత సీతారాం ఏచూరి పేదలకు చేసిన సేవలు మరువలేనివని సీఐటీయూ నాయకులు బాబావలి, హమాలీ యూనియన్ జిల్లా నాయకులు నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని సివిల్ సప్లయీస్ గోడౌన్‌లో శనివారం సీతారాం ఏచూరి వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బాబావలి, నాగరాజు మాట్లాడుతూ ఏచూరి సీపీఎం నేతగా, రాజ్యసభ సభ్యునిగా దేశానికి ఎంతో సేవ చేశారన్నారు.

నాణ్యమైన పాలను సేకరించాలి

పావగడ: నాణ్యమైన పాలను సేకరించి తుముల్ సంఘానికి మంచి పేరు తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్‌వీ వెంకటేశ్ సూచించారు. కుణిగల్ తాలూకా గవి మఠంలో తుముల్ పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రాదేశిక సభలో ఆయన మాట్లాడారు. పాల రైతుల పిల్లలకు మెరుగైన ఉచిత విద్యను అందిస్తామని, హాస్టల్ సౌలభ్యాలు సైతం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా డెయిరీలకు అధికంగా పాలను అందించిన పాల ఉత్పత్తిదారులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాల రైతుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక తుముల్ డైరెక్టర్ బెళ్లిబట్లు చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత ఊరేగింపు

పరిగి: ఊటుకూరులో గ్రామ దేవత బాల చౌడేశ్వరీ దేవి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పూల చౌడప్ప సహకారంతో పూల పల్లకీలో అమ్మవారిని శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకూ ఊరేగించారు.

‘రణభేరి’ని విజయవంతం చేయండి

గోరంట్ల: విద్యారంగ సమస్యలపై ఈనెల 17న గోరంట్లలో యూటీఎఫ్ తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కిష్టప్ప కోరారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద సంఘం నేతలతో కలసి రణభేరి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 17న పెనుకొండ నుంచి గోరంట్ల మీదుగా కదిరి వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు మురళి రామాంజనేయులు, శ్రీధర్‌రావు, రామకృష్ణ, నగేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు చిన్నికృష్ణ, కోశాధికారి అనిల్‌కుమార్, నగేష్, హెచ్‌ఎం రవికృష్ణ, యంజారప్ప, మహదేవప్ప, రమేష్‌బాబు, ఖాదర్‌వలీ, శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డప్ప, షణ్ముగం, స్వరూపరాణి, సంధ్యారాణి పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి సత్కారం



జెడ్పీటీసీ అశోక్‌ను సన్మానిస్తున్న నాయకులు

సోమందేపల్లి: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన జెడ్పీటీసీ అశోక్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం సాయంత్రం సత్కరించారు. అందరి సహకారంతో చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అశోక్ పేర్కొన్నారు. మహిళ విభాగం అధ్యక్షురాలు మణెమ్మ, బూత్ కమిటీ అధ్యక్షుడు ఇమామ్‌వలీలను సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, సాయిరాం, ఆదినారాయణ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీరాములు, మంజు, శివ, చంద్ర నాయక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిక

పెనుకొండ: పట్టణంలోని సివిల్ సప్లయీస్ స్టాక్ పాయింట్‌లో పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్. వెంకటేష్ మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సీఐటీయూ ఎల్లవేళలా మద్దతుగా ఉంటుందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. అనంతరం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా షమీవుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివానంద్, కోశాధికారిగా లక్ష్మి, వీరభద్ర, ఉపాధ్యక్షులుగా మహబూబ్‌బాషా, సహాయ కార్యదర్శిగా రెడ్డిశేఖర్‌ను ఎన్నుకున్నారు. నాయకులు బాబావలి, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

హిందూపురం: సంతేబిదనూర్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఘనంగా హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జాబేజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హిందీ ఉపాధ్యాయురాలు వనజ హాజరై మాట్లాడారు.



అమరాపురంలో హిందూ మహాగణపతి శోభాయాత్ర

గంగమ్మ ఒడికి గణనాథుడు

అమరాపురం/అగళి/పావగడ: మండల అమరాపురం, అగళి, పావగడలో శనివారం వినాయక నిమజ్జనం కనుల పండువగా సాగింది. ఆయా ప్రాంతాల్లోని వీధుల్లో వినాయక ప్రతిమలను ఊరేగించారు. ఈసందర్భంగా డీజే పాటలకు, డప్పు శబ్దాలకు అనుగుణంగా యువతీ యువకులు చిందులు వేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.





అమరాపురంలో కదలి వెళుతున్న శ్రీరాముడు, డప్పు వాయిస్తున్న మంగళూరు కళాకారులు



అగళిలో నృత్యం చేస్తున్న మహిళలు, యువకులు



పావగడలో నిమజ్జనానికి వినాయకుడిని తరలిస్తున్న దృశ్యం

వర్షం కోసం వరుణుడి ప్రతిమ ఊరేగింపు

రొళ్ల: వర్షాలు కురవాలని కోరుతూ శనివారం దొమ్మరహట్టిలో వరుణుడి ప్రతిమను ఊరేగించారు. ఈసందర్భంగా చిన్నారులు వరుణుడి ప్రతిమ తయారు చేసుకుని పూలతో అలంకరించి విషేష పూజలు చేశారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ నిత్యవసరాలను సేకరించారు వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

హిందూపురం: స్థానిక ఎంజీఎం ఉన్నతపాఠశాల ఆవరణలో శనివారం ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం 550 మంది పరీక్షలుచేసి వారిలో 175 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. రోగులను బెంగళూరు శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం గత నెలలో ఆపరేషన్ చేసుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జ్ నీల శివశంకర్, వలంటీర్లు రహంతుల్లా, నరసింహమూర్తి,రాజు పాల్గొన్నారు.